క్లుప్తంగా

డీఎస్పీకి సన్మానం



కల్వకుర్తిరూరల్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ పార్థసారధిని గురువారం తెలంగాణ మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు రావుల శ్రీను డీఎస్పీని మార్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రావుల శ్రీను, జయంతి, నరేందర్, నాగరాజు, అజయ్, నవ్య శ్రీ, పావని, అలివేలుమంగ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు బాబీదేవ్ కోరారు. గురువారం ఇందిరానగర్ కాలనీలో ఆయన పర్యటించారు. కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం, సీసీ రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

పెద్దకొత్తపల్లి: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. కబడ్డీలో 10 జట్లు, వాలీబాల్‌లో 10 జట్లు, ఖోఖోలో 10 జట్లు పోటీపడనున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

భగవద్గీత పఠనం

కల్వకుర్తిరూరల్: మండలంలోని యంగంపల్లిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం భగవద్గీత పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు గిరిధర్ రెడ్డి, మాతృమండలి జిల్లా అధ్యక్షురాలు సుకన్యలు హాజరై గీతాపారాయణం చేశారు.

భక్తిశ్రద్ధలతో మాసూం బాబా ఉత్సవాలు

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోలులో రెండు రోజుల నుంచి మాసూం బాబా ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి భక్తులు లారీలపై దర్గాలకు గంధాన్ని తీసుకొచ్చారు. అంతకుముందు మాసూంబాబాకు ఫాతేహా ఇచ్చి అన్నదానం చేశారు. పలువురు నాయకులు, భక్తులు బాబాను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఎంపీపీకి వినతి

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట సీసీ బెడ్ నిర్మాణాలు చేపట్టాలని కోరుతూ గురువారం టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎంపీపీ బోజ్యానాయక్, మార్కెట్ చైర్మన్ కిషన్‌నాయక్‌లకు వినతి పత్రం అందజేశారు.

ఆయుష్మాన్ భారత్ కార్డును పొందాలి

బిజినేపల్లి: ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు పొందేందుకు విద్యార్థులు బాధ్యతగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని లట్టుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శ్రీకాంత్ కోరారు. గురువారం మండలంలోని మంగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అంటు వ్యాధులు, చిరు వ్యాధులు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులపై అవగాహన కల్పించారు.


అసంపూర్తి ప్రాజెక్టులు పూర్తిచేయాలి

చారకొండ: కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గాల పరిధిలోని కేఎల్‌ఐ, డీఎల్‌ఐ అసంపూర్తి పనులు పూర్తిచేయాలని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ నాయకుడు ఆంజనేయులు అన్నారు. గురువారం మార్పు కోసం మహోద్యమం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోకారంలో డీఎల్‌ఐలో భూములు కోల్పోయిన నిర్వాసితులతో మాట్లాడారు. మండలంలోని గోకారంలో డీఎల్‌ఐ కింద భూములు కోల్పోయి రైతులు నష్టపోయారని, వీరందరిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హరిబాబు, మధుసూదన్, రామకృష్ణ, జగన్, కుమార్, రాము, చందు, లింగస్వామి, కౌశిక్, రాజు పాల్గొన్నారు.

ఏజెన్సీని రద్దు చేయాలి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రాంతీయ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికుల పొట్టగొడుతున్న ఏజెన్సీని రద్దు చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సురేష్ అన్నారు. గురువారం స్థానిక ప్రాంతీయ ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

పుష్కరఘాట్‌ను తాకిన కృష్ణమ్మ



పెంట్లవెల్లి: ఎగువ జూరాల ప్రాజెక్టు నుంచి దిగువకు గేట్లు తెరిచి వరద నీరు వదలడంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. మండలంలోని మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోలు గ్రామాలలో పుష్కరఘట్లలోకి కృష్ణమ్మ నీరు చేరుకుంది. మరో రెండు రోజులు వరద పోటెత్తితే పూర్తి స్థాయిలో పుష్కరఘాట్లు మునగనున్నాయి. కృష్ణానది రాకతో చుట్టుపక్కల ప్రజలు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కిక్కిరిసిన కార్యాలయాలు

తాడూరు: గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు రెవెన్యూ కార్యాలయం దరఖాస్తుదారులతో గురువారం కిటకిటలాడింది. చివరి తేదీ కావడంతో మండలంలోని 24 గ్రామాల ప్రజలతో కిక్కిరిసిపోయింది. తహసీల్దార్‌తో పాటు పలువురు సిబ్బంది హాజరుకాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎంపీడీఓ గంగమోహన్ స్పందించి కార్యాలయంలోని సిబ్బంది ద్వారా దరఖాస్తులను స్వీకరించారు.

చారకొండ: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ విద్యాధరి దరఖాస్తులు స్వీకరించారు. మండల వ్యాప్తంగా మొత్తం 2683 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు డాక్టర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.

పెద్దకొత్తపల్లి: గృహలక్ష్మికి కోసం వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి గురువారం అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ కార్యాలయంలో జనంతో కిటకిటలాడింది. మీసేవా కేంద్రాల్లో కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం పోటీ పడ్డారు.



తాడూరులో దరఖాస్తులు అందజేస్తున్న పలు గ్రామాల ప్రజలు

నాగర్‌కర్నూల్‌రూరల్: గృహలక్ష్మి పథకానికి గురువారం ఒక్కరోజే ఐదు వేలకుపైగా దరఖాస్తులు అందాయని అధికారులు పేర్కొన్నారు. ఆర్‌ఐ ఒక్కరే ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ఊర్కొండ: మండలంలో గురువారం నాటికి 1143 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు.

గృహలక్ష్మి పథకానికి 3058 దరఖాస్తులు

వెల్దండ: మండల వ్యాప్తంగా గృహలక్ష్మి పథకానికి మొత్తం 3058 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రవికుమార్ పేర్కొన్నారు.

మంత్రి హరీశ్‌రావు ప్రశంస

కల్వకుర్తి టౌన్: సాధారణ కాన్పులతోపాటు డెలివరీలు ఎక్కువ చేసిన కల్వకుర్తి సీహెచ్‌సీ వైద్యులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రశంసించారని ఆస్పత్రి సూపరింటెండెంట్ శివరాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలలుగా సగటున 70 శాతం కాన్పులు నిర్వహించారని గైనకాలజిస్టు విజయ్‌కుమార్‌ను అభినందించారు. కల్వకుర్తి సీహెచ్‌సీలో మే నెలలో 155, జూన్‌లో 140, జూలైలో 148 కాన్పులు చేశామన్నారు.

పోలీస్‌స్టేషన్ డీఎస్పీ సందర్శన

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం అచ్చంపేట డీఎస్పీ కృష్ణకిషోర్ సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. మండలంలో సీసీ కెమెరాల పనితీరు తదితర విషయాలపై ఎస్‌ఐ గురుస్వామిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అచ్చంపేట సీఐ అనుదీప్ ఉన్నారు.

తహసీల్దార్‌గా చెన్నకిష్టయ్య

ఊర్కొండ: ఊర్కొండ మండల తహసీల్దార్‌గా చెన్నకిష్టయ్య గురువారం బాధ్యత చేపట్టారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ కృష్ణ యాదాద్రి జిల్లాకు బదిలీ అయ్యారు.

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండల తహసీల్దార్‌గా జేకే మోహన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు తహసీల్దార్‌గా పనిచేసిన సరస్వతి బదిలీపై సంగారెడ్డికి బదిలీ కాగా, వనపర్తి మండలంలో తహసీల్దారుగా పని చేసిన జేకే మోహన్ బదిలీ అయ్యి బాధ్యతలు చేపట్టారు.

బిజినేపల్లి: మండల తహసీల్దార్‌గా శ్రీరాములు గురువారం బాధ్యతలు స్వీకరించారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం



తెలకపల్లి: గ్రామాభివృద్ధే లక్ష్యమని సర్పంచ్ జమ్ములు, ఉప సర్పంచ్ రారెడ్డిలు అన్నారు. మండలంలోని గౌరారంలో గురువారం ఒకటి, 10వ వార్డులలో అండర్ డ్రెయినేజీ పనులను వారు ప్రారంభించారు. ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న నిధుల నుంచి మంజూరైన రూ.10 లక్షలతో నిర్మాణ పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఎమ్మెల్సీ రూ.కోటి నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు, అండర్ డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్, హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రాజేందర్‌గౌడ్, లక్ష్మయ్య, రాజారెడ్డి, జంగయ్య, వెంకటయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 27 దరఖాస్తులు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలోని 67 మద్యం దుకాణాలకు గురువారం 27 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఫయాజుద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 9 దరఖాస్తులు, కొల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 12, కల్వకుర్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 14, తెల్కపల్లి, అచ్చంపేటలలో ఒక దరఖాస్తు చొప్పున అందాయని పేర్కొన్నారు. ఈనెల 18 వరకు గడువు ఉందని వివరించారు.

అధ్యక్షుడిగా సంతోష్‌నాయక్

అమ్రాబాద్: ఎన్‌ఎస్‌యూఐ అచ్చంపేట నియోజకవర్గం అధ్యక్షుడిగా మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సంతోష్‌నాయక్ నియామకం అయ్యారు. జిల్లా కమిటీ నుంచి నియామక పత్రం అందుకునట్లు గురువారం సంతోష్‌నాయక్ తెలిపారు.

ముమ్మరంగా సీసీ రోడ్ల నిర్మాణాలు

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని గుడిపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు కాగా సంబంధిత పనులను సర్పంచ్ పరిశీలించారు. అదేవిధంగా సంబంధిత శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్లు దగ్గరుండి పనులు చేస్తున్నప్పటికి పనుల్లో మాత్రం నాణ్యత లోపిస్తుందని గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అధికంగా డస్ట్ వినియోగిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు.

వీఆర్‌ఏలకు రిలీవ్

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వీఆర్‌ఏలను గురువారం కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ రవికుమార్ రిలీవ్ చేశారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లాలో నలుగురు, నాగర్‌కర్నూల్ 24 మంది కలెక్టరేట్‌లో రిపోర్టు చేశారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

బల్మూర్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మండలంలోని జీన్‌కుంటలో గురువారం ఆయన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పనులు చిత్తశుద్ధితో పూర్తి చేస్తామన్నారు. అర్హులందరికి గృహలక్ష్మి పథకంలో భాగంగా ఇళ్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ నర్సయ్య, సర్పంచ్ శ్రీనువాసులు, ఎంపీటీసీ లక్ష్మమ్మ, విష్ణుమూర్తి, ప్రేమ్‌రావు, సుదర్శన్, గోపాల్‌రావు, ఆశోక్, రాజు, ఉత్తరమ్మ, పాల్గొన్నారు.

లింగాల: గ్రామాలలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. మండలంలోని చెన్నంపల్లిలో రూ.20 లక్షల నిధులతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల రూపురేఖలు మారాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్‌నాయక్, సీపీసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, వెంకటగిరి, మాజీ జెడ్పీటీసీ మాకం తిర్పతయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుధీర్‌గౌడ్, జిల్లా నాయకులు కేటీ తిర్పతయ్య, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జీన్‌కుంటలో కాజ్‌వేకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్: సాగునీటి కాలువ నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న పులిజాల రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. గురువారం మండలంలోని పులిజాలలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కాలువ నిర్మాణం కోసం భూములు ఇవ్వడానికి ముందుకు వచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లోక్యానాయక్, రామాచారి, పర్వతాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

బిజినేపల్లి: సీఎం కేసీఆర్ ప్రజలను మభ్య పెట్టేందుకు ఇస్తున్న మోసపూరిత హామీలను నమ్మొద్దని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారి పర్వతాలు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గృహలక్ష్మి పథకానికి మూడు రోజుల గడువు ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎండీ పాషా, ఎండీ అంజద్ పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని శ్రీరంగాపూర్‌లో హాథ్ సే హాథ్ జోడోలో భాగంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పల్లెనిద్రను నిర్వహించారు. శ్రీనివాస్‌రాథోడ్, పూజారి వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

మన్ననూర్: హాత్‌సే హాత్ జోడోలో భాగంగా అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావిలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఆయుర్వేద శిబిరం విజయవంతం

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని చింతలోనిపల్లి, కల్ములోనిపల్లి, తెలుగుపల్లి గ్రామాల్లో గురువారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. మొత్తం 264 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి జాన్సన్ తెలిపారు.

ఆర్థిక సాయం

కల్వకుర్తి: మండల కేంద్రానికి చెందిన శివగౌడ్ బోన్ క్యాన్సర్ వ్యాధి కారణంగా గతంలో కాలు తొలగించారు. వ్యాధి చికిత్స కోసం బాధిత కుటుంబసభ్యులు ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గురువారం గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.12వేల ఆర్థిక సహాయం అందజేశారు. వ్యాధి చికిత్స కోసం రూ.10 లక్షల ఖర్చు చేసినట్లు బాధితుడి తండ్రి రాజుగౌడ్ తెలిపారు.

ఆదివాసీ గిరిజన హక్కులను కాపాడుకుందాం

కొల్లాపూర్ రూరల్: ఆదివాసీ గిరిజన హక్కులను కాపాడుకుందామని ఏఐసీసీ జాతీయ ఓబీసీ కో ఆర్డినేటర్ కేతూరి వెంకటేష్ అన్నారు. గురువారం మండలంలోని అమరగిరి చెంచుగూడెంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో షెడ్యూల్డ్ కులాలు, తెగలపై అఘాయిత్యాలు జరగకుండా నిరోధక చట్టం 1989లో రూపొందించిందన్నారు. రాష్ట్రలాలో జనాభా నిష్పత్తికి సమానమైన బడ్జెట్ కెటాయింపులు అందించడానికి 1975లో గిరిజన ఉపప్రణాళికను ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం పల్లె నిద్ర చేశారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా మైనారిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఫరీద్ అహ్మద్, కిరణ్ కుమార్, నాగేంద్రం, అమరగిరి ఉప సర్పంచ్ మల్లేష్ తదితరులు ఉన్నారు.



గిరిజన విద్యార్థులతో కేతూరి వెంకటేష్ తదితరులు

డీసీపీ వెంకటేశ్వర్‌రావును సస్పెండ్ చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: విద్యార్థి నాయకులపై అకారణంగా చేయి చేసుకున్న డీసీపీ వెంకటేశ్వర్‌రావును వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐవైఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా నాయకుడు ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల విద్యార్థి నాయకులు సెక్రెటరేట్ ముట్టడికి వెళ్తున్న రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఉపాధ్యక్షుడు రహమాన్, నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, రాష్ట్ర నాయకులపై విచక్షణా రహితంగా దాడి చేశారని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే డీసీపీ వెంకటేశ్వర్‌రావును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాస్, స్టీఫెన్, మహేష్, మధు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



సమ్మెలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: సుప్రీంకోర్టు తీర్పు మేరకు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా గురువారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన మహాపడావ్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన సమ్మెలో ఆయన మాట్లాడారు. కార్మిక వర్గాన్ని విచ్ఛిన్నం చేయడానికి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాసిందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు మారేడు శివశంకర్, ఐఎంటీయూసీ నాయకుడు పైడి శ్రీనివాసులు, నాయకులు శేఖర్, మారయ్య, జీవన్, వెంకటయ్య, వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో రెండో ఏఎన్‌ఎంల నిరసన

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు నల్లబ్యాడ్జీలు ధరించి గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ఈశ్వర్ మాట్లాడుతూ రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం మంజుల, సుమిత్ర, యశోద, పుష్ప, వసుంధర, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: రెండో ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలని ఆ సంఘం జిల్లా యూనియన్ అధ్యక్షురాలు హైమావతి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఏఎన్‌ఎంలు కళావతి, అనురాధ, సునిత, రాజేశ్వరి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



పెంట్లవెల్లిలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సెకండ్ ఏఎన్‌ంలు

వెల్దండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండో ఏఎన్‌ఎంలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఏఎన్‌ఎంలు తిరుపతమ్మ, పద్మ, పద్మావతి, బాలమణి, అలివేలు తదితరులు ఉన్నారు.

‘స్థాయికి మించి మాట్లాడొద్దు’

అచ్చంపేట: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు స్థాయికి మించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నేతలను విమర్శించే ముందు ఆత్మ పరిశీలన చేసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు చిక్కుడు వంశీకృష్ణ సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. పీసీసీ అధ్యక్షుడిని కిరాయి అధ్యక్షుడని ఎమ్మెల్యే వ్యాఖ్యానించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అచ్చంపేటకు కిరాయికి వచ్చింది మీరు కాదాఅని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలకు బయటపెడతామన్నారు. ఒకప్పుడు సీఎం కేసీఆర్, ప్రస్తుత ఎమ్మెల్యే గువ్వల కూడా కాంగ్రెస్‌లో పని చేసింది నిజం కాదా అన్ని ప్రశ్నించారు. బెదిరించడం, తిట్టడం, అక్రమ కేసులు పెట్టించడం గువ్వలకే చెందుతుందని విమర్శించారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎ.గోపాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ వై.శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ ఎం.రామనాథం, గంగాపురం రాజేందర్, మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, కటకం రఘురాం, మహబూబ్‌అలీ, తిరుపతయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ

ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా సంతోష్

మన్ననూర్: ఎన్‌ఎస్‌యూఐ విద్యార్థి సంఘం అచ్చంపేట నియోజకవర్గ అధ్యక్షుడిగా రెండోసారి సంతోష్‌ను ఎన్నుకోవడంపై అమ్రాబాద్ మండల ఎన్‌ఎస్‌యూఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సంతోష్ ఎంపికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణకు సంతోష్ సహచరులు లడ్డు యాదవ్, సురేష్, మహేష్, లక్ష్మణ్, ప్రవీణ్, రేణయ్య తదితరులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాక్టర్ పరికరాలు చోరీ

వెల్దండ: మండలంలోని కుప్పగండ్లలో ట్రాక్టర్ పరికరాలు చోరీకి గురైన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జల్లెల శ్రీధర్‌కు చెందిన పాలు పితికే యంత్రాలు, దేశం రాంరెడ్డికి చెందిన నాగళ్లు, జంగయ్యకు చెందిన బ్యాటరీలు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. సుమారుగా వాటి విలువ రూ.లక్ష వరకు ఉంటుందని బాధితులు వాపోయారు. పోలీస్‌స్టేషన్‌లో గురువారం బాధితులు ఫిర్యాదు చేశారు.

రెండు బైకులు ఢీ: ముగ్గురికి తీవ్ర గాయాలు

ఊర్కొండ: రెండు బైకులు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బండెల శ్రీనివాస్ రెడ్డి పని నిమిత్తం మండల కేంద్రానికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో విద్యార్థులు గోవిందు, పూజలను బైక్‌పై ఎక్కించుకొని గ్రామానికి వెళ్తున్నాడు. గ్రామ సమీపంఓ జగబోయింపల్లి గ్రామానికి చెందిన క్యాత మోని రాజేష్ బైక్ వారిని ఢీకొన్నది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితులను కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి చిన్నాన్న చంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

బల్మూర్: మండలంలోని గోదల్‌లో గురువారం వృద్ధుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మన్నే సత్యనారాయణ(65) ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా జూపల్లి జన్మదినం

కొల్లాపూర్: మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకలను గురువారం పట్టణంలోని జూపల్లి నివాసం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు రఘుపతిరావు, హన్మంతు నాయక్, కమలాకర్‌రావు, మేకల నాగరాజు, బాలస్వామి, రహీంపాషా, నయూమ్, ఎక్బాల్, కేతూరి ధర్మతేజ తదితరులున్నారు.

కాంగ్రెస్‌తోనే మహిళా సంక్షేమం

కొల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మహిళలు అన్నిరంగాల్లో సాధికారత సాధించారని మహిళా కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ నిషా అన్నారు. గురువారం కొల్లాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ సమావేశం పార్టీ నాయకురాలు తిరుపతమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నిషా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాళ్లు రోహిణిరెడ్డి, శ్రీలతరెడ్డి పాల్గొన్నారు.

గ్రామస్తులకు అవగాహన

తెలకపల్లి: మండలంలోని రాకొండలో రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రావేఫ్ విద్యార్థులు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామ నమూనా పటం, కాలక్రమ పటం, పశువుల గణాంకంపై చార్టు వేసి వాటి ప్రాధాన్యత, ఉపయోగాల గురించి వివరించారు. గ్రామంలో నీటి పారుదల, వనరులు, చెరువులు, కుంటలు, కాలువలతో పాటు పలు వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎరువులు, పురుగుల మందులు, పంట యాజమాన్య పద్ధతులు, పంటల మార్పిడీ వల్ల కలిగే లాభాలు తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల రావేఫ్ విద్యార్థులు, పాలెం కేవీకే శాస్త్రవేత్తలు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

వెల్దండ: మండల కేంద్రంలో సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను గురువారం సర్పంచ్ భూపతిరెడ్డి పంపిణీ చేశారు. సడమోని వెంకటేష్‌కు రూ.36వేలు, గొడుగు శ్రీనివాసులుకు రూ.25వేలు విలువ చేసే చెక్కులను ఆయన అందజేశారు. ఉప సర్పంచ్ నిరంజన్, కృష్ణారెడ్డి, నిరంజన్‌గౌడు, ఆనంద్, దేవేందర్, శేఖర్, ఉన్నారు.

లింగాల వాసికి డాక్టరేట్

లింగాల: మండల కేంద్రానికి చెందిన అధ్యాపకుడు ఇల్లెందుల శ్రీనివాసులు కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మోనాడ్ యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ మోడల్స్‌తో బ్రెయిన్ ట్యూమర్ డయాగ్నసి పరిశోధనను పూర్తి చేయడంతో పీహెచ్‌డీ పట్టాను పొందారు. ప్రస్తుతం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. మోనాడ్ యూనివర్సిటీ డైరెక్టర్ సుల్తాన్‌సింగ్ నుంచి పట్టా అందుకున్నారు.

నేడు సామూహిక కుంకుమార్చన

కందనూలు: జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని జ్ఞాన సరస్వతి దేవాలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన, లలితా సహస్ర పఠనం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్య, ఆలయ కోశాధికారి దొడ్ల ఇందుమతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వాల్ పోస్టర్ విడుదల

బిజినేపల్లి: మండలంలోని గంగారంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీల ఆధ్వర్యంలో గురువారం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. 12న జిల్లాలో ఆయా ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు, ధర్నాలు చేపట్టాలని, సెప్టెంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లో మహాధర్నాకు నిర్వహిస్తునట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు. హెచ్‌ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు రత్నశేఖర్, రాజప్ప, యాకుబ్ అలీ పాల్గొన్నారు.

చెంచుపెంటల్లో వైద్యశిబిరం

అమ్రాబాద్: మన్ననూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కొమ్మెనపెంట, కొల్లంపెంటల్లో ఐటీడీఏ సహకారంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సుధాకర్, డివిజన్ మలేరియాధికారి అశోక్‌ప్రసాద్, సూపర్‌వైజర్ పార్వతి ఉన్నారు.

గడప గడపకు బీజేపీ

బిజినేపల్లి: మండలంలోని మమ్మాయిపల్లిలో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా గురువారం గడప గడపకు బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండా మణమ్మ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. మల్లికాడి లక్ష్మణ్, కొండా నాగేష్, లక్ష్మణ్, మహేష్, చిన్నరాయుడు ఉన్నారు.

16న మందకృష్ణ మాదిగ రాక

కొల్లాపూర్: ఈనెల 16న పట్టణానికి మందకృష్ణ మాదిగ రానున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రమోని యాదగిరి మాదిగ పేర్కొన్నారు.